జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై సీఎం స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్

సూరారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30: తెలంగాణలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాల కేటాయించే విషయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్ డిమాండ్ చేశారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ నగరంతో పాటు ఇతర జిల్లాల గ్రామీణ విలేకరులకు ఇళ్ల స్థలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానపరమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో సంబంధిత శాఖ మంత్రి రాష్ట్రంలో యూనియన్ నేతలతో సంప్రదింపులు జరిపి ఒక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఇళ్ల స్థలాల విషయంలో స్వప్రయోజనాల కోసం కొందరు గందరగోళాన్ని సృష్టిస్తున్నారన్నారు. ఈ మధ్యకాలంలో జర్నలిస్టులపై పలు చోట్ల దాడులు జరుగుతున్నాయని వాటిని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని అటాక్స్ కమిటీలను పునరుద్ధరించాలని సూచించారు.

దుండిగల్‌లో ఇళ్ల స్థలాల కేటాయింపుపై ఒత్తిడి తెస్తాం...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పని చేస్తున్న జర్నలిస్టులకు దుండిగల్‌లోని ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ఎన్నో ఏండ్లుగా నిరీక్షిస్తున్న అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ ఇంటి స్థలాన్ని కేటాయించేందుకు సంఘం త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ప్రత్యేక బడ్జెట్‌ల నుంచి సూరారంలో అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణాన్ని త్వరలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సంఘం కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు సుధీర్‌మంకాల, జిల్లా నాయకులు, కొలెపాక వెంకట్, సుగ్రీవుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివాజీ, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్, నర్సింహ, పత్తి మాధవ్, శ్రీగిరి శ్రీనివాస్, ఎర్రోళ్ల బాబు, మల్లేశ్, సురేశ్‌గౌడ్, శోభన్, కల్యాణ్, బి.వెంకట్, జుట్టు సాయి, అనంతరావు, క్రిష్ణ పంతులు, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మదాపూర్, సెప్టెంబర్ 30: ఫీడర్ మరమ్మతుల కారణంగా కొండాపూర్ వైట్ ఫీల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. కళాజ్యోతి 11 కేవీ ఫీడర్ పరిధిలోని కళాజ్యోతి బిల్డింగ్ చుట్టు ఏరియాలు, రాజ ప్రసాదం బిల్డింగ్ చుట్టు ప్రాంతాలు, ఉదయం 11 నుంచి ఒంటి గంటల వరకు, మెజిక్యూటీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని సీఎంసీ లే ఔట్, మసీద్‌బండ ప్రధాన రహదారి, గౌతమి సొసైటీ అపార్ట్ మెంట్ ప్రాంతాల్లో 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరరా ఉండదని తెలిపారు.

బతుకమ్మ సందడి షురూ..

కార్పొరేటర్ రోజాదేవి

కూకట్‌పల్లిలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

బతుకమ్మతో మహిళ

బాలానగర్, సెప్టెంబర్ 30 : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి రూపంగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను కూకట్‌పల్లిలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క రంగులతో మహిళలు తయారు చేసిన బతుకమ్మలతో ఆట పాటలతో సంబురాలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు వడ్డేపల్లి యామిని, మాధవరం రోజాదేవిలు హాజరై బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు.

బతుకమ్మలతో వస్తున్న మహిళలు

కూకట్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సమస్యలపై నియోజకవర్గం పరిధి కార్పొరేటర్లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, సెప్టెంబర్ 30 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేయనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గం ప్రజలకు అండగా నిలిచి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలుంటే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా సమస్యలను గుర్తించి మరమ్మతులు చేసే పనులు తక్షణమే చేయాలని అన్నారు. హైడ్రా విషయంలో ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ఉండాలని భరోసా ఇచ్చారు. నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు అందరూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. బతుకమ్మ ఉత్సవాలు కూడా ప్రారంభమవుతున్న సందర్భంగా వేడుకలకు ఎక్కడ కూడా అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా నియోజకవర్గం అంతటా శాంతియుత వాతావరణం నెలకొని ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పోరాడుతూ ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ పెండింగ్ పనులు పూర్తి చేయడంలో దృష్టి సారించాలని కార్పొరేటర్లకు సూచించారు. కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, సబిహగౌసుద్దీన్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, మైనార్టీ నాయకుడు ఎండీ గౌసుద్దీన్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఎంపీ ఈటల అభినందన

విశ్వగురు వరల్డ్‌రికార్డు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, నిర్వాహకులతో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్, సెప్టెంబర్ 30 : నిజాంపేట్‌లోని సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ చెందిన 125మంది చిన్నారి, చిత్రలేఖన కళాకారులు 108 నిముషాలలో 125 రకాల విభిన్న గణపతి పెయింటింగ్‌లను కాన్వాస్‌పై చిత్రించి విశ్వగురు వరల్డ్ రికార్డు సాధించారు. ఆదివారం రాత్రి బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలో పాల్గొన్న చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులు గీసిన చిత్రాలను తిలకించి అభినందించారు. చిన్నారులను ప్రోత్సహిస్తే ఇటువంటి అద్భుతాలెన్నో చేస్తారని, వారికి ఈ రకంగా అవకాశాలు కల్పిస్తున్న సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు డా.సత్యవోలు రాంబాబు పూజిత దంపతులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్ఎస్. రాజు, రైల్ వికాస్ నిగమ్ జనరల్ మేనేజర్ ఆనంద్ చెక్కిళ్ల, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరిపల్లి రమణశ్రీ, వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయరాణి, డా.పి.కిశోర్‌కుమార్, ప్రముఖ చిత్రకారులు శేష బ్రహ్మం, కృష్ణాది శేషు, రవిచరణ్, డాక్టర్ మార్కండేయులు, దేవరపల్లి హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో సోమవారం కొండాపూర్‌లోని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోదరి హితరెడ్డి ఇంటికి వచ్చి పరామర్శించిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, కార్తీక్‌రెడ్డి.

– మాదాపూర్, సెప్టెంబర్ 30

హఫీజ్‌పేట్ డివిజన్‌లోని వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న సీనియర్ జర్నలిస్ట్, ఈటీవి హైదరాబాద్ బ్యూరో చీఫ్ ఆది నారాయణ అకాల మృతి చెందడంతో సోమవారం మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి వారి నివాసానికి చేరుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ.

– మాదాపూర్, సెప్టెంబర్ 30

సీఐటీయూ ఆధ్వర్యంలో చలో లేబర్ ఆఫీస్

లేబర్ కార్యాలయం వద్ద సీఐటీయూ నేతల నిరసన

దుండిగల్, సెప్టెంబర్30: కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం సీఐటీయూ చలో లేబర్ ఆఫీస్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల పేరిట పరిశ్రమల యాజమన్యాలు కార్మిక చట్టాలను అమలు చేయకుండా 12 గంటల నుంచి 16 గంటల వరకు పనిచేయించుకుని శ్రమదోపిడి చేస్తున్నాయని, ఈఎస్ఐ, పీఎఫ్ బోనస్‌లాంటి సౌకర్యాలు కల్పించడంలేదని అన్నారు. ఎవరైనా కార్మికులు పని గంటల గురించి మాట్లాడితే అదేరోజు కార్మికుల్ని ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సంవత్సరాల తరబడి పనిచేసినప్పటికీ పర్మినెంట్ అనే పదాన్నే యాజమాన్యాలు మరిచిపోయాయని విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యాల దయాదాక్షిన్యాలపై ఆధారపడవలసి వస్తుందని వైద్యం ఖర్చులు కూడా సరిగా ఇవ్వడంలేదని, యజమానులు లాభాలే తప్పా కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు అంజయ్య, కే శ్రీను, మల్లారెడ్డి, బాషా, తాయన్న, ఆంజనేయులు, కరుణాకర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్మికులు ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జడ్సీ అపూర్వ చౌహాన్, డీసీ కృష్ణయ్య

బాలానగర్, సెప్టెంబర్ 30 : స్వచ్ఛ కార్మికులు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలన్నదే లక్ష్యమని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లి జోన్ పరధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ కార్మికులు, ఎంటమాలజీ కార్మికులు విధిగా ఆరునెలలకు ఒకసారి ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డయాబెటీస్, బీపీ ఉన్నవారు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. స్వచ్ఛ కార్మికులందరూ ఆరోగ్య నియమాలు పాటించి అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీ కృష్ణయ్య, జోనల్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ఫెర్నాండెజ్, డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు, మనోహరరెడ్డి, గోపిక, శోభిమ, అజిత్‌లతో పాటు ఎస్ఆర్పీలు, ఎస్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

రైతు దీక్షకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

ఇందిరాపార్క్‌వద్ద చేపట్టిన రైతుదీక్షలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ కుత్బుల్లాపూర్ బీజేపీ కో-కన్వీనర్ పొత్తూరి శివాజీరాజు, నేత పి.సత్తీశ్‌సాగర్

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 : బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన రైతుదీక్షకు కుత్బుల్లాపూర్ నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. దీక్షలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణతో దీక్ష లో కూర్చొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో-కన్వీనర్ పొత్తూరి శివాజీరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కొంపల్లి అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నేతలు పెద్దబుద్దుల సత్తీశ్‌సాగర్, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సునీతారావు, మధు, శంకర్‌నాయక్, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను పరిష్కరించడంలో ఆవిష్కరణలు కీలకం

● మహీంద్రా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఐఐటీ ధనబాద్ డైరెక్టర్ సుకుమార్ మిశ్రా

సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

దుండిగల్,సెప్టెంబర్ 30: సవాళ్లను పరిష్కరించడంలో సహకారం, ఆవిష్కరణలు కీలకమని ముఖ్య అతిథి ఐఐటీ ధనబాద్ డైరెక్టర్ సుకుమార్ మిశ్రా తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని మహీంద్రాయూనివర్సిటీలో సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వాహనాలపై ద్వితీయ అంతర్జాతీయ సదస్సు (ఐసీపీఈఈవీ) నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమార్ మిశ్రా మాట్లాడుతూ.. మనం అభివృద్ధి చేసే పరిష్కారాలు రేపటి భవిష్యత్తుకు దారి చూపుతాయన్నారు. మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులూమెదురి మాట్లాడుతూ.. సమగ్ర ఆలోచనలు, సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా దేశానికి మేధోరాజధానిగా ఎదగడమే తమ లక్ష్యమన్నారు. పరిశోధన, అభివృద్ధి రంగాలలో కొత్త ఆవిష్కరణలు, భాగస్వామ్యాలతో విద్యార్థులు ముందుకు వెళ్లాలని అన్నారు. అనంతరం ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ రాం వేమూరి మాట్లాడుతూ.. పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల వంటి ఆధునిక రంగాలలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి సహకరించడం లక్ష్యమన్నారు. మూడు రోజుల ఈ సదస్సులో ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, పవర్ కన్వర్టర్స్, గ్రిడ్ ఇంటిగ్రేషన్ వంటి పలు అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా యూనివర్సిటీ ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు భార్గవ రాజారాం, జీ భువనేశ్వరి, గోపీనాథ్ జీఆర్, శ్రీధర్ మాడిచెట్టి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 3 నుంచి దేవీ శరన్నవరాత్రులు

బాలానగర్, సెప్టెంబర్ 30 : ఫతేనగర్ జవహర్‌నగర్‌కాలనీలోని కనకదుర్గ, కాళికాదేవి, శీతలాదేవి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి దోర్భలకాశీనాథ్ శర్మ, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి అక్టోబర్ 3వ తేదీ నుంచి 12 తేదీ వరకు శరన్నవరాత్సోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నవరాత్రుల పూజలలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన వివిధ ప్రాంతాల ప్రజలు

దుండిగల్,సెప్టెంబర్30 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువజన, సంక్షేమసంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సోమవారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ, తమ కాలనీలు/బస్తీలల్లో నెలకొన్న సమస్యలను తెలియజేయడంతో పాటు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

అనుమానాస్పద స్థితిలో మెకానిక్ మృతి

బాలానగర్, సెప్టెంబర్ 30 : అనుమానాస్పద స్థితిలో మెకానిక్ మృతి చెందాడు. కేపీహెచ్‌బీకాలనీ పోలీసుల కథనం ప్రకారం.. న్యూ బోయిన్‌పల్లి బాలాజీనగర్‌లో ఉండే పల్నాడు రాజు జనరేట్ మెకానిక్. సోమవారం ఉదయం 8 గంటలకు జనరేటర్ రిఫేర్ చేయాలని ఫోన్ రావడంతో బయటకు వెళ్లాడు. కాగా కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్, పోచమ్మ ఆలయం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు రాజు కుమారుడు గణేశ్‌కు సాయంత్రం 4.15 గంటలకు ఫోన్ చేసి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాంటీన్ నిర్వహణ రంగానికి గొప్ప డిమాండ్

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేసిన సీఈఓ డి. దివ్య

మాదాపూర్, సెప్టెంబర్ 30: మహిళలు సాధికారత వైపుగా అడుగులు వేయాలని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ సీఈఓ డి. దివ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో సోమవారం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లో పది రోజుల పాటు రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఉపాధి దిశగా ముందుకు సాగాలన్నారు. క్యాంటీన్‌కు సంబంధించి మహిళా అభ్యర్థులకు స్నాక్స్, సలాడ్లు, గ్రేవీలు, శాండ్‌విచ్‌లు, టిఫిన్‌లు, పౌడర్‌లు, తెలంగాణ స్వీట్స్, సావరీస్, కేకులు, కుకీలు, హైదరాబాదీ బిర్యానీ వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఫైనాన్స్ సెర్వ్ డైరెక్టర్ క్రాంతి, డైరెక్టర్లు గోపాల్‌రావు, ప్రశాంతి, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు, జనరల్ సెక్రటరీ రవి బూరా, ఎన్ఐటీహెచ్ఎం ఇన్‌చార్జ్, ప్రిన్సిపాల్ ఎంకే గణేశ్, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ మిచెల్ ఫ్రాన్సిస్, టీసీఈఐ ట్రైనింగ్ హెడ్ ఆఫ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ అజయ్ చంద్ర తదితరులు ఉన్నారు.

ఈ నెల 2 నుంచి శిల్పారామంలో ఫోక్ ఆర్ట్స్ ఫెస్టివల్

మాదాపూర్, సెప్టెంబర్ 30 : మాదాపూర్, సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నాగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 2 వ తేదీ నుంచి 4 వ తేదీ వరకు డివిజనల్ ఫోక్ ఆర్ట్స్ ఫెస్టివల్‌ని శిల్పారామం ఆవరణలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 2న పేరిణి నాట్యం, ఒగ్గు డోలు, డప్పు, మాధురి డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించగా అక్టోబర్ 3న బోనాలు డ్యాన్స్, కొమ్ముకాయ, ధింసా డ్యాన్స్, గుస్సాడీ డ్యాన్స్, అక్టోబర్ 4 న బతుకమ్మ, చెక్క భజన, లంబాడి డ్యాన్స్, సురభి నాటకం వంటి ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిని చూసేందుకు నగర వాసులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సత్‌జ్ఞాన్ హైస్కూల్లో భగవద్గీత అవధానం

సమావేశంలో స్కూల్ కరస్పాండెంట్ లయన్ మల్లేశం

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 30 : విద్యార్థులకు భగవద్గీత ప్రాముఖ్యతను చాటిచెప్పేందుకు కుత్బుల్లాపూర్ సత్‌జ్ఞాన్ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం భగవద్గీత అవధానం వినిపించిన్నట్లు నిర్వాహకుడు గోగులపాటి కృష్ణమోహన్, సత్‌జ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం తెలిపారు. హైస్కూల్ విద్యార్థులకు యువావధాని, ప్రవచన కర్త యెర్రంశెట్టి ఉమామహేశ్వర్‌రావుచే భగవద్గీత అవధానం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు భగవద్గీతలోని శ్లోకాలను ఆలపించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్,సెప్టెంబర్ 30 : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన నిధులతో నియోజకర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతియేట స్కూల్ బ్యాగులు, పెన్నులు, నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కార్పొరేటర్ సబీహాబేగం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎమ్మెల్యే అందిస్తున్న స్కూల్ బ్యాగుల కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ప్రతియేట అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, అబ్దుల్ రజాక్, శివ, మహమ్మద్ నూర్ ఖాన్, యోగిరాజు, బాలరాజు, ఖదీర్, భాను తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా..గ్లోబల్ ఎస్సేప్రైజ్

ఎస్సే ప్రైజ్‌లో విజేతలైన విద్యార్థులు

మాదాపూర్, సెప్టెంబర్ 30 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని శాంక్టా మారియా ప్రిన్సిపాల్ హేమ సంజయ్ అన్నారు. శేరిలింగంపల్లిలోని శాంక్టా మారియా పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు జాన్ లాక్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ ఎస్సే ప్రైజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూకే మాజీ ప్రధాన మంత్రి లిజ్ ట్రస్ట్ హాజరై ప్రిన్సిపాల్ హేమ సంజయ్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తత్వ, రాజకీయం, ఆర్థిక, చరిత్ర, మానసిక, ధర్మ, న్యాయ శాస్త్రాలపై రాయడానికి విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎస్సే ప్రైజ్‌లో నిషి, ఆన్య, రౌనక్ అనే ముగ్గురు విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి 2 వేల మందికి పైగా హాజరయ్యారు.